క్లుప్తంగా

చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు



మాచర్ల: మాచర్ల పట్టణంలోని పాత మాచర్లలో ఆదివారం ఉపవాస ప్రార్థనల్లో భాగంగా మరనాత మందిరంలో పాస్టర్ వై.ఎలిషా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నాల్గవ వచనం వివరించి ఏసు ప్రభు వాక్యాలను బోధించారు. ఈ కార్యక్రమంలో ఎం.దానియేల్, బిక్కం అంజి, పి.చెన్నయ్య, నాగమ్మతో పాటు పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు. అదే విధంగా కేసీపీకి వెళ్లే రహదారిలో ఉన్న చర్చిలో పాస్టర్ దానియేల్ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పాత మాచర్లలో 25వ వార్డులో బేతేల్ మందిరంలో పాస్టర్ జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు, ఉపవాస ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు.

మాచర్లలో మెగా జాబ్‌మేళా



మాచర్ల: వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో యువతను ప్రోత్సహించేందుకు మెగా జాబ్ మేళాను రామాటాకీస్ శ్రీనివాస్ మహల్ అధినేత షేక్ జానీ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని మాచర్ల ఎమ్మెల్యే జి.బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ పీడబ్ల్యూడీ కాలనీలో స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, ఆయన కుమారుడు గౌతమ్‌రెడ్డి, అంకిరెడ్డిలు ప్రారంభించారు. సుమారు 30 కార్పొరేట్ కంపెనీల వారు హాజరయ్యారు. నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల కేసవరెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.లెనిన్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షులు కె.దుర్గారావు, షేక్‌మాదర్ సాహెబ్, టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు, ప్రైవేట్ కంపెనీల నిర్వాహక ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

గురజాల : స్థానిక వాగ్దేవి కళాశాల సమీపంలో అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణం చేయుటకు ఏర్పాటు చేసిన స్థలంలో సద్ది కార్యక్రమం నిర్వహించుటకు షెడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరుగుతుందని అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు భూమి పూజ నిర్వహించడం జరుగుతుందని, అయ్యప్ప భక్తులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

హోంగార్డుకు తీవ్ర గాయాలు



కారెంపూడి: గురజాల సబ్ జైల్‌లో హోంగార్డుగా పని చేస్తున్న కారెంపూడికి చెందిన షేక్ జావిద్ గురజాల మండలం చర్లగుడిపాడు గ్రామ సమీపంలో రోడ్డుపై ఆదివారం రాత్రి రక్తం మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. బైక్‌పై వస్తుండగా వర్షం పడడంతో బైక్ స్కిడ్ అయి పడ్డాడా లేక మరేదైనా వాహనం ఢీకొందా లేక వేరే ఏమైనా కారణాలున్నాయా అనే విషయాలు తెలియాల్సి ఉంది. జావిద్‌ను గురజాలలో ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేటకు తరలించారు. కారెంపూడి సర్కిల్ ఆఫీస్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రమణమూర్తి గురజాల వెళ్తూ ఘటనను గమనించారు. ప్రస్తుతం జావిద్ ఆరోగ్య పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. జావిద్ గురజాలలో విధి నిర్వహణ అనంతరం స్వగ్రామం కారెంపూడి వస్తుండగా ఈ ఘటన జరిగింది.

సకాలంలో వర్షాలు.. కళకళలాడుతున్న చేలు

అమరావతి : ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు సకాలంలో కురిసిన వర్షాలకు మండలంలోని గ్రామాలలో అన్ని పంటల సాగుకు అనుకూలంగా ఉండటంతో ప్రధానంగా పత్తి పంట ఏపుగా పెరుగుతుండటంతో రైతులలో సంతృప్తి వ్యక్తం అవుతుంది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఎరువులు వేసి పత్తి పంటలో అంతరకృషి చేస్తుండటంతో పత్తి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. అదనుకు వర్షాలు పడుతుండటంతో పత్తి చేలు నవనవలాడుతున్నాయి. అలాగే మిరప నారు కూడా పెరుగుతుండటంతో నాటు వేయటం కోసం రైతులు పొలాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో అత్యధికంగా వర్షాభావ పంటలు పండిస్తుండటంతో ఇప్పటి వరకు అదనుకు వర్షం పడుతుండటంతో రైతులలో హర్షం వ్యక్తమవుతుంది. మండలంలో పత్తి సుమారు 22 వేల ఎకరాలలో సాగు చేయగా, మిర్చి 3000 ఎకరాలలో సాగు చేసే అవకాశం ఉందని, వరి 200 ఎకరాలు, కూరగాయలు, ఇతరాలు 300 ఎకరాలలో సాగు అవుతుందని వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గత సంవత్సరం తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులు ఈ ఏడాది దిగుబడులు పెరుగుతాయన్న ఆశతో సాగు చేస్తున్నారు.

● వాగులు గలగల.. పంటలు కళకళ



నీటితో కళకళలాడుతున్న బుగ్గవాగు

గతంలో నీళ్లు లేక వెలవెలబోయిన కాలువలు నేడు జలకళను సంతరించుకున్నాయి. గత నెలలో కురిసిన వర్షాలకు కాలువలు, చెరువులు పూర్తిస్థాయిలో నిండి గలగలా పారుతున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో నాగార్జునసాగర్ నీటి మట్టం క్రమంగా పెరుగుతుంది. దీంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గతంలో బీళ్లుగా ఉన్న పొలాలను సైతం సాగు చేసేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో కనుచూపు మేర పచ్చదనంకనిపిస్తుంది. -గురజాల





కళకళలాడుతున్న వరి నారు , పత్తి పంట

అనురాగాలు.. ఆప్యాయతలకు ప్రతీక రాఖీ

- ● నేడు రాఖీ పండుగ వేడుకలు
- ● జోరుగా రాఖీల విక్రయాలు

దాచేపల్లి, గురజాల : ఆప్యాయతలు పంచుతూ..కష్టాల్లో తోడూనీడగా..అనుబంధానికి ప్రతిరూపంగా.. యోగక్షేమాలు తెలుసుకుంటూ.. తోబుట్టువుల బంధాన్ని శాశ్వతంగా నిలిపేదే రక్షాబంధన్. అన్నా చెల్లెళ్లు..అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు.. అనురాగానికి నిర్వచనమే ఈ రాఖీ పండుగ. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని దుకాణాల్లో రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నేడు శ్రావణ పౌర్ణమి కావటంతో రాఖీ పౌర్ణమిని తోబుట్టువులు ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. అక్క చెల్లెళ్లు కట్టిన రాఖీలతో సోదరుల చేతులు వివిధ రంగులు, డిజైన్ల రాఖీలతో కళకళలాడుతుంటాయి. అండగా ఉంటామని హామీ ఇస్తూ అన్నదమ్ములు తమకు తోచిన విధంగా.. తోబుట్టువులకు బహుమతులు ఇస్తుంటారు. రాఖీ కట్టిన తరువాత సోదురులు ఇచ్చే చిన్నపాటి బహుమతైనా సోదరీమణులు సంతోషంగా స్వీకరిస్తారు. రక్షాబంధన్‌ను రాఖీ పౌర్ణమి లేదా జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు.

రాఖీలతో కళకళలాడుతున్న మార్కెట్‌లు

రాఖీ పండుగ సందర్భంగా మార్కెట్‌లోని దుకాణాలు కళకళలాడుతున్నాయి. మార్కెట్‌లోని పలు దుకాణాల్లో సంప్రదాయ, ఆధునిక రాఖీలు అబ్బుర పరుస్తున్నాయి. వ్యాపారులు రంగురంగుల రాఖీలను అమ్మకాలకు పెట్టారు. ప్రధానంగా పిల్లలను ఆకర్షించే వివిధ కామిక్ రాఖీలను ఎక్కువగా విక్రయిస్తున్నారు. మరికొన్ని బంగారు బ్రాస్‌లెట్‌లను తలపించేలా రాఖీలు మార్కెట్‌లో ధగధగలాడుతున్నాయి. రూ.10 రూపాయల నుంచి వేల



దాచేపల్లిలోని ఓ దుకాణంలో రాఖీలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

రూపాయలు ఖరీదు చేసే రాఖీలు మార్కెట్‌లో ఉన్నాయి. రాఖీ పండుగకు ముందుగానే రాఖీలను కొనుగోలు చేసేందుకు అక్క చెల్లెళ్లు ఉత్సాహం చూపిస్తున్నారు. దాచేపల్లిలోని కొట్లాబజార్, నడికుడి రైల్వేస్టేషన్ రోడ్డులోని షాపులు అక్క చెల్లెళ్లతో కళకళలాడుతున్నాయి.

ఆన్‌లైన్‌లో కానుకలు

మారుతున్న శాస్త్రసాంకేతిక కాలంలో రక్షాబంధన్ తీరు కూడా మారుతుంది. విద్య, ఉపాధి, ఇతరత్రా కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులకు ఇప్పటికే పలు కొరియర్ సర్వీసులు, పోస్టు ద్వారా రాఖీలను పంపించారు. వాటిని చేతికి కట్టుకున్న సోదరులు అక్క చెల్లెళ్లమ్మలకు దూర ప్రాంతాల నుంచి కానుకలు పంపించి సంప్రదాయాలకు తగిన విలువ ఇస్తున్నారు. తాము దూరంలో ఉన్నా అక్కచెల్లెళ్లు.. అన్నదమ్ముల మధ్యం దూరం లేదని నిరూపిస్తున్నారు. దేశ, విదేశల్లో ఉంటున్నప్పటికీ వారి పద్ధతులు మారిన కానీ అనుబంధం, ఆప్యాయత మాత్రం చెక్కు చెదరలేదు.



దాచేపల్లిలో రాఖీలను కొనుగోలు చేస్తున్న విద్యార్థినులు

ముత్యాలమ్మకు బోనాలు సమర్పణ

రెంటచింతల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై గడుస్తున్నా ప్రతి రోజు ఆకాశం మేఘావృతమై ఉంటున్నా పంటలు సాగు చేసుకునేందుకు సరిపడా వర్షం పడకపోవడంతో మిట్టగుడిపాడుకు చెందిన అన్నదాతలు కురణించవా... వరుణదేవా అంటూ ఆదివారం గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య, శివయ్యల నేతృత్వంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బోనాలతో గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహిస్తూ వర్షాలు సకాలంలో కురిసి పైరు పంటలు సమృద్ధిగా పండి రైతన్నల ఇంట సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఇంటికి బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

పలుచోట్ల వర్షం... రైతులు హర్షం

రెంటచింతల: వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం సాయంత్రం మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం పడటంతో రైతులు హర్షం వ్యకం చేస్తున్నారు. 25 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు మండల వాతావరణ శాఖ సూపర్ వైజర్ బద్దిగం ఈశ్వర్‌రెడ్డి వెల్లడించారు. జూన్, జూలై నెలల్లో సకాలంలో చిన్నపాటి వర్షాలు మాత్రమే కురవడంతో మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు పూర్తిస్థాయిలో వ్యవసాయ పనులను చేపట్టలేకపోయారు. మండలంలో ప్రస్తుతం పత్తి పంట పనులు పూర్తికావడం జరిగింది. వరి దమ్ము చేసి వరినాట్లు వేసే పనులు, మిర్చి మొక్కలు వేసే పనులలో రైతులు నిమగ్నమయ్యారు. మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో మొత్తం 10,358 హెక్టార్లు సాగులో ఉండగా మిర్చి 4,686 హెక్టార్లలో సాగు చేస్తుండగా, పత్తి 3,274 హెక్టార్లలో వేయడం జరిగిందన్నారు. వరి 1,862 హెక్టార్లలో, అపరాలు 536 హెక్టార్లలో ఈ ఏడాది సాగు చేయనున్నారని అంచనా వేయడం జరిగిందన్నారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు వరద నీరు చేరడంతో అవి పూర్తిస్థాయిలో నిండటంతో రైతుల్లో సంతోషం వెల్లివిరుస్తుంది.

గురజాలలో వర్షం


గురజాల : గురజాలలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో కూడిన ఎండతో ప్రజలు ఇబ్బంది పడాల్సివచ్చింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. సుమారు గంట పాటు కుండపోత వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారిపై వర్షం నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

మాచర్ల : మాచర్ల పట్టణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత విపరీతంగా ఉండగా ఆకస్మికంగా రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తుండటంతో విద్యుత్ సరఫరాను నిలిపివేసి ముందస్తు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు చేరింది. వర్షం ప్రభావం, విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.



గురజాలలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

ఆహ్లాదంగా ముందుకు సాగేలా..



రోడ్డుకి ఇరువైపులా పచ్చని చెట్ల మధ్య రహదారి.. ఎంత అందంగా ఉందో కదా.. ఇలా చూసి చాలా రోజులైంది. గతంలో ఏ రహదారి చూసినా ఈ విధంగా దర్శనమిచ్చేవి. కానీ నేడు రహదారులు అన్నీ వెడల్పు చేయడంతో ఆ వాతావరణం చాలా తక్కువగా కనిపిస్తుంది. గురజాల నుంచి మాడుగుల మీదుగా దుర్గి వెళ్లే మార్గం మాత్రం ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. రోడ్డుకి ఇరువైపులా పచ్చని చెట్లు దర్శనమిస్తూ స్వచ్ఛమైన గాలితో కూడిన వాతావరణంతో ప్రయాణం సాఫీగా ముందుకు సాగుతుంది. -గురజాల

వైభవంగా శ్రావణమాస బోనాలు

బెల్లంకొండ: శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం దేవతామూర్తులకు వైభవంగా శ్రావణ మాస బోనాలను భక్తులు సమర్పించారు. మండల కేంద్రమైన బెల్లంకొండలో గ్రామ దేవత ముత్యాలమ్మకు భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని బుడగజంగాలు అమ్మవారికి బోనాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో పోలేరమ్మ తల్లి జాతరను భక్తులు నిర్వహించారు. భక్తులు జలబిందెలతో ఊరేగింపుగా వెళ్లి దేవతామూర్తులకు జలాభిషేకాలను నిర్వహించారు. పొంగళ్లు చేసి నైవేద్యాలను సమర్పించారు.



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ తల్లి



చంద్రాజుపాలెంలో బోనాలను సమర్పిస్తున్న భక్తులు

వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

అచ్చంపేట: స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2025 జూన్‌లో జరిగే వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వవిద్యార్థుల సంఘ సభ్యులు సమావేశమయ్యారు. ఈ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. మహానుభావుడు తుమ్మేపల్లి శ్రీరాములు 5 ఎకరాల విస్తీర్ణంలో 12 సువిశాల గదులు నిర్మించి జిల్లా పరిషత్‌కు అప్పగించారన్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులంతా తప్పనిసరిగా వచ్చే జూన్ నెలలో జరిగే వజ్రోత్సవ వేడుకలలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. దీనిపై సెప్టెంబర్ 21వ తేదీన పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులతో సమావేశం జరుగుతుందని, సాధ్యమైనంత మంది పాల్గొని వేడుకల నిర్వహణకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పసుపులేటి పాపిరెడ్డి, కోశాధికారి సూరే సంపత్, కొప్పురావూరి కోటేశ్వరరావు, సూరే కోటిలింగం, గుండా వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు, సభ్యులు

కొవ్వొత్తులతో నిరసన



పెదకూరపాడు: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై మండల పరిధిలోని పాడపాడు గ్రామంలో పలువురు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అత్యాచారం, హత్యకు పాల్పడిన దుండగులను వెంటనే అరెస్టు చేసి వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఆదివారం రాత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్య సమాజం సిగ్గుపడే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

నరసరావుపేట టౌన్: ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి బయలుదేరిన భార్య అదృశ్యమైందంటూ భర్త ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన ఎస్.నాగరాజు చేసిన ఫిర్యాదు మేరకు... తన భార్య సుధారాణి స్వగ్రామమైన అచ్చంపేటకు వెళ్తానంటే మురికిపూడి నుంచి నరసరావుపేటకు వచ్చి ఆర్టీసీ బస్టాండ్‌లో ఇద్దరు కుమార్తెలతోపాటు బస్ ఎక్కించాడు. వారు పుట్టింటికి చేరలేదు. ఫోన్ చేసినా స్పందన లేదు. గాలించినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ ఆదివారం రాత్రి తెలిపారు.

దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహిళల కోలాటం



మాయల పకీరు నాటకంలోని సన్నివేశం

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నాల్గవ రోజు ప్రథమ పుష్కర ద్వాదశ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థానం నిర్వాహకులు, బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పాతూరి వెంకట రమసుబ్బారావులు స్వామి వారి నిత్యారాధన, మంగళాసనం, వసంతోత్సవం, యాగశాలలో పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మొక్కపాడు బ్రహ్మం మాస్టారు ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి కోలాట భజన మండలి బృందంచే మహిళా కోలాటం నిర్వహించారు. శనివారం రాత్రి నిర్వహించిన బాలనాగమ్మ జానపద నాటకం చూపరులను ఆకట్టుకుంది. మాయల పకీరు జెట్టి సాంబశివరావు చేసిన నటనకు ప్రేక్షక కళా పోషకులు ముగ్దులయ్యారు. సోమవారం బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణికుమార్ శర్మచే వేంకటేశ్వర తత్వవైభవంపై ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం భక్త చింతామణి నాటకం కలవని బాలాజీ ట్రస్ట్ చైర్మన్ తెలిపారు.

సకాలంలో విత్తనాల అందజేతకు కృషి

ఈపూరు: రైతులు జేజీఎల్ రకానికి ప్రత్యామ్నాయంగా కేఎస్ఎం 1638 వరి రకం విత్తనాలు సాగు చేసుకోవచ్చని ఏవో రామారావు తెలిపారు. కావాల్సిన వారు ఒక రోజు ముందుగా వ్యవసాయ అధికారులకు, సిబ్బందికి చెప్పాలన్నారు. తద్వారా సకాలంలో తాము అందించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ విత్తనాల సాగు పంట కాలం 130 నుంచి 135 రోజులు ఉంటుందని, ఉల్లికోడును తట్టుకుంటుందని వెల్లడించారు. హెక్టారుకు 6 నుంచి 7 టన్నులు దిగుబడి వస్తుందని తెలిపారు. బీపీటీ 5204, ఎంటీయూ 1224, ఎస్ఎల్ఆర్ 34449 రకాలను కూడా సాగు చేసుకోవచ్చని సూచించారు. ఈ విత్తనాలు దోమపోటు, అగ్గి తెగులను తట్టుకుంటాయని తెలిపారు. విత్తనాలను ఏపీ సీడ్స్, అధీకృత డీలర్ల నుంచి తీసుకోవాలని కోరారు. వ్యవసాయ సిబ్బంది సూచనలతో పంటసాగు చేయాలని తెలిపారు.

గొర్రెలలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అమరావతి: వర్షాకాలం సీజన్‌లో గొర్రెలు, మేకలలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పెంపకం దారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండటం అవసరమని మండల పశు వైద్యాధికారి వెంకట్రామయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకం దారులలో వ్యాధుల పట్ల అవగాహన కొరవడటంతో వారు నష్టపోతున్నారన్నారు. గొర్రెలు, మేకల పెంపకం దారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వాటికి వచ్చే కాలిపుండ్లు, నీలినాలుక, పచ్చిక దొమ్మ వంటి వ్యాధులను గమనించాలన్నారు. వీటిలో కాలిపుండ్లు వ్యాధికి టీకాలు ఉన్నాయన్నారు. నీలినాలుక వ్యాధి వైరస్ ద్వారా వ్యాపించటంతో దీనికి టీకాలు లేవని దీని నివారణకు రాత్రిళ్లు వేపాకు పొగ వేయాలని, బ్యుటాక్స్, డెల్టావిత్రిస్ వంటి మందులను గొర్రెలు, మేకలపై స్ప్రే చేయాలన్నారు. పచ్చిక దొమ్మ వ్యాధి తడిసిన మేతను తినటం వల్ల వస్తుందని, దీని నివారణకు మేత ఆరిన తర్వాత మాత్రమే మేపాలన్నారు. మండల పరిసర ప్రాంతాలలో సున్నం, బ్లీచింగ్ చల్లాలని సూచించారు. బురదగా ఉంటే గొర్రెలను మెరక ప్రాంతాలలో కట్టి వేయాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఈ మూడు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ధర్మ ప్రచారం



అమరావతి: త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో మంగళవారం మండల పరిధిలోని ఎంద్రాయి గ్రామంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో శ్రీకృష్ణ భగవానుడి సర్వ మానవాళికి అందించిన సందేశాలు ప్రతి ఒక్కరికి అందేలా ప్రచారం చేస్తున్నామని త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి- హిందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకృష్ణుడు ప్రపంచానికి అందించిన జ్ఞాన సంపద అందరికి తెలియపరుచుటకు ప్రతి గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా సమితి సభ్యులు కృష్ణారావు, శివలింగంనాయక్, శ్రీకాంత్, చంద్రశేఖర్, నాగార్జున, హరిబాబు, చంద్రగౌరి పాల్గొన్నారు.